క్లుప్తంగా

బాధ్యతల స్వీకరణ

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ (భూత్పూర్) : మండలంలోని మహాత్మా జ్యోతి రావు పులే బాలికల రెసిడెన్షియల్ పాఠశాల నూతన ప్రిన్సిపాల్‌గా సుగుణ శ్రీ ని నియమించారు. ఈమేరకు గురు వారం బాధ్యతలు స్వీకరించారు.

నేడు సర్వసభ్య సమావేశం

గండేడ్(కోయిల్‌కొండ): మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఎంపీపీ శశికళ అధ్యక్షతన మండల సర్వసభ్యసమావేశం నిర్వహించనున్నారు. ఈమేరకు వివరాలను గురువారం ఎంపీడీఓ కాళప్ప తెలిపారు. ఈ మేరకు ప్రజాప్రతినిధులు, అధికారులు సకాలంలో హాజరుకావాలని సూచించారు.

నవాబుపేట ఎస్ఐగా విక్రమ్



నవాబుపేట: మండల ఎస్ఐగా విక్రమ్ గురు వారం బాధ్యతలు స్వీకరించారు. కాగా ఆయన గతంలో గద్వాల్‌లో ఎస్ఐగా విధులు నిర్వహించారు. తాజాగా నవాబుపేటకు బదిలీ అయ్యారు. ఇదివరకు ఇక్కడ విధులు నిర్వహించిన ఎస్ఐ అభిషేక్‌రెడ్డి నాగర్‌కర్నూల్ జిల్లా వీఆర్‌కు బదిలీ అయ్యారు. నూతన ఎస్ఐ విక్రమ్‌ను వివిధ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు సన్మానించారు.

వైద్యవిద్యార్థికి ఆర్థికసాయం



గండేడ్(కోయిల్‌కొండ): మండలంలోని గార్లపహాడ్ గ్రామానికి చెందిన వైద్య విద్యార్థి వేణుగోపాల్‌కు దాతలు చేయూతనందించారు. ఈ మేరకు మహబూబ్‌నగర్‌లో వందేమాతరం ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రతిభా పురస్కారాల ప్రదానోత్సవ కార్యక్రమంలో.. ప్రముఖ వ్యాపారవేత్త కల్పన బచ్చిరెడ్డి ఫౌండేషన్ జిల్లా సమన్వయకర్త రవీందర్‌రెడ్డి సూచన మేరకు రూ. 30వేల ఆర్థికసాయం అందించారు. వేణుగోపాల్ చదువు పూర్తయ్యే వరకు సహకారం అందిస్తామని ప్రకటించారు. విద్యార్థి తల్లిదండ్రులను సన్మానించారు.

సైనిక్ స్కూల్ ఏర్పాటుపై కృషి

నారాయణపేట: జిల్లా కేంద్రంలో సైనిక్ స్కూల్ ఏర్పాటుకు కృషిచేస్తానని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ హామీ ఇచ్చినట్లు జిల్లా బీజేపీ అధ్యక్షుడు పి. శ్రీనివాసులు పేర్కొన్నారు. గురువారం ఢిల్లీలో మంత్రి బండి సంజయ్‌ని పగడాకుల శ్రీనివాస్ కలిసి సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు.. గతంలో పేటకు మంజూరైన సైనిక్ స్కూల్ రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వహయంలో స్థలం చూపకపోవడంతో తరలించారని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఈ విషయంపై మంత్రి స్పందిస్తూ తప్పకుండా సైనిక్ స్కూల్ ఏర్పాటుకు కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు శ్రీనివాసులు తెలిపారు.

పేట టూ విజయవాడకు డీలక్స్ బస్సు

నారాయణపేట: నారాయణపేట ఆర్టీసీ డిపో నుంచి విజయవాడకు డీలక్స్ బస్సు ప్రారంభించబడిందని డిపో మేనేజర్ లక్ష్మీసుధ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నారాయణపేట నుంచి మధ్యాహ్నం 3:20 గంటలకు బయలుదేరి విజయవాడకు ఉదయం 3:15 గంటలకు చేరుకుంటుంది. నారాయణపేట నుంచి విజయవాడకు వయా, మక్తల్, మహబూబ్‌నగర్, కల్వకుర్తి, దేవరకొండ, సాగర్, మాచర్ల, గుంటూరు, విజయవాడ చేరుకుంటుంది. తిరిగి విజయవాడ నుంచి 10:15 గంటలకు బయలుదేరి అదే రూట్లో నారాయణపేటకు రాత్రి 8:30 గంటలకు చేరుకుంటుంది. ఈ సర్వీస్‌కు ఆన్ లైన్ రిజర్వేషన్ సౌకర్యం కల్పించబడిందని తెలిపారు. కావున ఈ ప్రాంత ప్రజలు ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవాలని కోరారు.

నోటిఫికేషన్ విడుదల చేయాలి

నారాయణపేట: చేప పిల్లల టెండర్స్ నోటిఫికేషన్ ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని జిల్లా మత్స్యశాఖ అధ్యక్షుడు ఎ. కాంత్ కుమార్ ముదిరాజ్ డిమాండ్ చేశారు. గురువారం జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు.. జిల్లాలోని పలు గ్రామ సొసైటీలలో ముదిరాజ్‌లకు మత్స్య సహకార సభ్యత్వం చేయడం, మత్స్య సంపదయోజన కింద ఇన్సూరెన్స్ వివరాలు, డిస్టిక్ ఫిషరీష్ ఆఫీసర్ రాజా ప్రతాప్‌ను అడిగి తెలుసుకున్నారు. జిల్లా ఉపాధ్యక్షుడు నీరటి నరసింహనాయుడు, డైరెక్టర్స్ హన్మంతు, రామకృష్ణ, ఆనంద్, పెద్ద విజయ్, ఆంజనేయులు, సరిత, వెంకటేష్, ఎదురింటి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



సిగ్నల్‌గడ్డ రైల్వే బ్రిడ్జిపై ట్రాఫిక్‌లో చిక్కుకున్న 108 అంబులెన్స్



నిలిచిపోయిన వాహనాలు

జడ్చర్లలో ట్రాఫిక్ జాం..

- వాహనాల మధ్య చిక్కిన అంబులెన్స్

పట్టణంలో గురువారం ట్రాఫిక్ జాం ఏర్పడింది. స్థానిక సిగ్నల్‌గడ్డ వద్ద రైల్వే బ్రిడ్జికి అటు ఇటుగా కొంత దూరం వాహనాలు ఎక్కడికక్కడే నిలిచి రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ప్రధాన రహదారి విస్తరణ పనుల కారణంగా నిత్యం ఇక్కడ ట్రాఫిక్ జాం నెలకొంటుంది. ఫలితంగా రాకపోకలు సాగించే వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు విస్తరణ పనుల నిర్వహణ కూడా అస్తవ్యస్తంగా కొనసాగుతుండడంతో ఇక్కట్ల పాలవుతున్నారు. దీనికి వర్షం కూడా తోడు కావడం, అదే సమయంలో పాఠశాలల బస్సులు రోడ్డుపైకి రావడంతో రోడ్డంతా చిత్తడిగా మారి ఇబ్బందులు తలెత్తాయి. కాగా దాదాపు రెండు సంవత్సరాలకు పైగా పనులు సాగుతున్నాయని ఆరోపిస్తున్నారు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో పనులు నిర్లక్ష్యంగా నత్తనడకన సాగుతున్నాయని, నాణ్యత ప్రమాణాలు సైతం పాటించే పరిస్థితి కానరావడం లేదని అంటున్నారు. ఇదిలా ఉండగా.. సిగ్నల్‌గడ్డ రైల్వే బ్రిడ్జిపై ట్రాఫిక్ జాంలో గురువారం రెండు అంబులెన్స్‌లు చిక్కుకున్నాయి. దాదాపు 20 నిమిషాల పాటు అంబులెన్స్‌లకు దారి ఇచ్చే పరిస్థితి లేకపోవడంతో సైరన్ మోతలు మోగాయి. ఎవరికి వారు వాహనాలను నెమ్మదిగా ముందుకు కదల్చడంతో అంబులెన్స్‌లు కదిలేందుకు చాలా సమయం పట్టింది.

– జడ్చర్ల/జడ్చర్ల టౌన్

పెరుగుతున్న సీజనల్ వ్యాధులు



చికిత్స పొందుతున్న రోగులు

జడ్చర్ల టౌన్: పట్టణ పరిసర ప్రాంతాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయి. వర్షాకాలం ఆరంభం కావటంతో విరేచనాల (డయేరియా) బారిన పడుతున్న వారి సంఖ్య పెరుగుతూ వస్తోంది. అదే విధంగా జ్వరాల బారిన పడి చికిత్సకు వచ్చే వారి సంఖ్య సైతం అదేస్థాయిలో ఉంటోంది. జడ్చర్ల ఏరియా ఆస్పత్రిలో డయేరియాతో బాధపడుతూ చికిత్స పొందుతున్న వారి సంఖ్య క్రమంగా పెరుగుతోంది. డయేరియాతో సోమవారం 17మంది, మంగళవారం 7మంది, బుధవారం 7, గురువారం సాయంత్రం 4గంటల వరకు 9మంది ఇన్‌పేషెంట్లుగా చేరి చికిత్స పొందుతున్నారు. వీరిలో కొందరు వాంతులు, విరేచనాలతో చికిత్స పొందుతున్నారు. ఇక జ్వరాలతో ఇన్‌పేషెంట్లుగా చేరేవారి సంఖ్య నిత్యం 5కుపైనే నమోదవుతున్నాయి. వర్షాకాలంలో తగిన జాగ్రత్తలు తీసుకోకుంటే సీజనల్ వ్యాధులు వెంటాడుతాయని ఆస్పత్రి సూపరింటెండెంట్ డా.సోమశేఖర్ తెలిపారు. కాచిచల్లార్చిన నీటిని తీసుకోవాలని, అప్పుడే వండివార్చిన ఆహారం భుజించాలని ఆయన సూచించారు. ముఖ్యంగా ఈ సీజన్‌లో మాంసాహారం భుజించకపోవటం మంచిదని తెలియజేశారు.

'డీఎస్సీ' 2నెలలు వాయిదా వేయాలి



హర్షవర్ధన్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న డీఎస్సీ అభ్యర్థులు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ : ప్రభుత్వం జులైలో నిర్వహించాల్సిన డీఎస్సీ పరీక్షను రెండు నెలలు వాయిదా వేయాలని కోరుతూ అభ్యర్థులు టీపీసీసీ అధికార ప్రతినిధి హర్షవర్ధన్‌రెడ్డికి వినతి పత్రం గురువారం అందజేశారు. మొన్నటి వరకు గ్రూప్–1 పరీక్షల కోసం సిద్ధమైన తాము నెల రోజుల సమయం కూడా లేకుండా డీఎస్సీ రాయాలి అంటే కష్టంగా ఉంటుందన్నారు. కొంత సమయం ఇస్తే ప్రిపరేషన్ కొనసాగించేందుకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. అంతేకాకుండా గ్రూప్–2 పోస్టులు చాలా వరకు ఖాళీగా ఉన్నాయని, ప్రస్తుతం ఉన్న 783 పోస్టుల నుంచి 1500 పోస్టులకు పెంచాలని కోరారు. సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని హర్షవర్ధన్‌రెడ్డిని కోరారు.

అధ్వానంగా అంతర్గత రోడ్లు



తిమ్మాయిపల్లి తండాలో రోడ్డు పరిస్థితి ఇలా..

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ (అడ్డాకుల): మండలంలోని తిమ్మాయిపల్లి తండాలో అంతర్గత రోడ్లు అధ్వానంగా మారాయి. ప్రధాన రోడ్డు నుంచి ఖిల్లాఘనపురం మండలంలోని సూరాయపల్లి వైపు వెళ్లే రోడ్డు పూర్తి అధ్వానంగా మారింది. ఇక్కడ రోడ్డుపైనే నీళ్లు ప్రవహించడంతో రోడ్డంతా బురదమయంగా మారి రాకపోకలకు ఇబ్బందులు తప్పడం లేదు. అందులోనూ సీసీరోడ్డు లేకపోవడంతో వర్షాకాలం తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నట్లు గిరిజనులు వాపోతున్నారు. బురదమూలంగా దోమలు, ఈగలు వ్యాప్తించి రోగాల బారిన పడతామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి అంతర్గత రోడ్లను బాగు చేయించాలని గిరిజనులు కోరుతున్నారు.

పార్లమెంట్ ముట్టడిలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

స్టేషన్ మహబూబ్‌నగర్: 'నీట్' పత్రాల లీక్‌ను నిరసిస్తూ ఢిల్లీలో జాతీయ యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో గురువారం జరిగిన పార్లమెంట్ ముట్టడిలో జిల్లాకు చెందిన పలువురు నాయకులు పాల్గొన్నారు. వీరిలో జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు వాసుయాదవ్, మహబూబ్‌నగర్ అసెంబ్లీ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు జె.చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి రాఘవేంద్ర యాదవ్, పట్టణ అధ్యక్షులు ఎండీ.సల్మాన్, కార్యనిర్వాహక అధ్యక్షుడు రమేష్‌నాయక్, మహబూబ్‌నగర్, హన్వాడ మండలాల అధ్యక్షులు రవీందర్, శ్రీశైలం యాదవ్, జడ్చర్ల అసెంబ్లీ ఉపాధ్యక్షుడు శ్రీనివాసులుయాదవ్, మల్లికార్జున్, రమేష్, గిరి, ప్రవీణ్‌యాదవ్ తదితరులు ఉన్నారు.

మహిళా సంఘాలకు మీసేవా కేంద్రాలు

నవాబుపేట: గ్రామాల్లోని మహిళలకు మినీ మీసేవా కేంద్రాలు.. మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా మంజూరు అయ్యాయని ఏపీఎం జీవరత్నం తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం కొత్తగా మహిళ శక్తి కార్యక్రమాలు తీసుకుని వచ్చి.. వారు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు కార్యక్రమాలు చేపడుతున్నట్లు వివరించారు. ఇందులో భాగంగానే మండలంలో కొన్ని గ్రామాలను ఎంపిక చేసి వాటిలో మీసేవ కేంద్రాల ఏర్పాటుకు అనుమతి వచ్చిందని పేర్కొన్నారు. మహిళలకు స్వయం ఉపాధి కార్యక్రమంలో భాగంగా మరికొన్ని యూనిట్లు మంజూరైనట్లు పేర్కొన్నారు.

విద్యార్థికి అభినందన



జడ్చర్ల టౌన్: నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ నిర్వహించిన కేంద్రీయ విశ్వవిద్యాలయ ప్రవేశ పరీక్ష (పీజీ).. హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం తెలుగు విభాగంలో 8వర్యాంక్ సాధించిన బీఏ తృతీయ సంవత్సర విద్యార్థి హరికృష్ణను గురువారం అధ్యాపకబృందం అభినందించింది. ప్రిన్సిపాల్ డా. అప్పియా చిన్నమ్మ చాంబర్‌లో హరికృష్ణకు ప్రశంసా పత్రం అందించి సత్కరించారు. విద్యార్థి ఉన్నతస్థితికి చేరుకోవాలని ఆకాంక్షించారు. అదేవిధంగా కళాశాలలో బీకాం తృతీయ సంవత్సరం చదువుతున్న ఎస్. భాస్కర్ ఆంధ్రప్రదేశ్ కేంద్రీయ విశ్వవిద్యాలయం తెలుగు విభాగంలో 16వ ర్యాంక్ సాధించడంపై అభినందించారు. కార్యక్రమంలో అధ్యాపకులు సుభాషిని, రమాదేవి, యాదయ్య ఉన్నారు.

నిరుపయోగంగా క్రీడా ప్రాంగణాలు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ (భూత్పూర్): గ్రామీణ ప్రాంతాల్లో క్రీడా నైపుణ్యం పెంచడానికి ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణాలు మండల పరిధిలో నిరుపయోగంగా మారుతున్నాయి. గత ప్రభుత్వం ఒక్కో గ్రామ పంచాయతీకి ఒక ప్రాంగణం నిర్మించింది. గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా 10 గుంటల భూమి (1200 చదరపు గజాలు) కంటే తక్కువ కాకుండా ప్రతి గ్రామ పంచాయతీల్లో రూ.1 లక్షకు పైగా ఖర్చు చేసి ప్రాంగణాల నిర్మాణం చేపట్టారు. మండలంలోని 18 గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలోని 10 వార్డుల్లో తహసీల్దార్ చూపించిన ప్రభుత్వ స్థలాల్లో నిర్మాణం జరిగింది. అయితే ప్రస్తుతం అవి ఏమాత్రం వినియోగంలో లేకుండా పోతున్నాయి. దాదాపు కిలోమీటర్ కంటే ఎక్కువ దూరంలో ఉండడం వంటి కారణాలతో అక్కడికి వెళ్లడానికి ఆసక్తి చూపడం లేదు. దీనికి తోడు నీటి నిర్వహణ సైతం సరిగా లేదని ప్రజలు పేర్కొంటున్నారు.



పాత మొల్గర క్రీడా ప్రాంగణం



భట్టుపల్లి తండా సమీపంలోని క్రీడా ప్రాంగణం



హస్నాపూర్ గ్రామ శివారులో..

ఖాతాదారుల సంక్షేమానికి పాటుపడాలి



ఎమ్మెల్యే యెన్నం సన్మానిస్తున్న బ్యాంక్ చైర్మన్ కుమారస్వామి తదితరులు

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రానికి సమీపంలోని ఓ గార్డెన్స్‌లో గురువారం ది పాలమూరు కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్ మహబూబ్‌నగర్ నూతన పాలకవర్గం ప్రమాణాస్వీకార కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి నూతన పాలకవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు. మూడు దశాబ్దాలుగా ఏ విధమైన ఒడిదుడుకులు లేకుండా ఖాతాదారులకు సేవలందిస్తున్నందున అభినందిస్తున్నట్లు తెలిపారు. ఎల్లప్పుడూ ఖాతాదారుల సంక్షేమానికి పాటుపడాలని సూచించారు. అనంతరం బ్యాంక్ కార్యవర్గం ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించింది. బ్యాంక్ చైర్మన్‌గా కండె కుమారస్వామి, సీనియర్ వైస్ చైర్మన్‌గా గుండ్ల కృష్ణయ్య, వైస్ చైర్మన్‌గా కలకొండ సూర్యనారాయణ, డైరెక్టర్లుగా ఎదిరే తమ్మయ్యా, కల్వ కన్నయ్యశెట్టి, డి.జ్యోతి, ఎస్.సంగమేశ్వర్, పుల్ల శ్రీనివాస్, పోల నాగలక్ష్మి, రాగిరి తిరుపతయ్య, పి. రాంమోహన్. గుండ వెంకటేశ్వర్లు ప్రమాణాస్వీకారం చేశారు. శ్రీకంబగిరి లక్ష్మీనరసింహ్మాస్వామి ఉపాసకులు సద్గురు శ్రీ రాంమోహనస్వామి పాల్గొని నూతన పాలకవర్గానికి ఆశీర్వాచనం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్, ఆర్యవైశ్య ప్రముఖులు ప్రమోద్‌కుమార్, కొండ చక్రధర్‌గుప్త, రాఘవేందర్ తదితరులు పాల్గొన్నారు.

జీరో బిల్లు ఆన్‌లైన్ త్వరగా పూర్తి చేయాలి



ఆన్‌లైన్ ప్రక్రియను పరిశీలిస్తున్న జెడ్పీసీఈఓ రాఘవేందర్‌రావు

నవాబుపేట: జీరో బిల్లు, గ్యాస్ సబ్సిడీ లబ్ధిదారుల వివరాలు త్వరగా ఆన్‌లైన్ చేసి వారికి ప్రభుత్వ పథకాలు అందుబాటులో ఉండేల చూడాలని జెడ్పీసీఈఓ రాఘవేందర్‌రావు సూచించారు. గురువారం ఆయన మండల కేంద్రంలో దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియ కార్యక్రమాన్ని పరిశీలించారు. యుద్ధ ప్రాతిపాదికన వాటిని పూర్తి చేయాలన్నారు. అలాగే గ్యాస్ కనెక్షన్‌లకు సంబంధించి వివరాలు సైతం ఎంట్రీ చేయాలని వివరించారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధిహామీ, పొదుపు సంఘాలపై సంబంధిత అధికారులతో సమావేశమై ఆరాతీశారు. ఉపాధి పథకం సోషల్ ఆడిట్ త్వరలో జరగనున్న తరుణంలో అన్ని రికార్డులు పూర్తి చేసి వారికి అందించాలని వివరించారు. శ్రీనిధి తదితర రుణాలు వెంట వెంటనే టార్గెట్ పూర్తి చేసుకోవటంతో పాటు రికవరీ సైతం వంద శాతం ఉండేలా చూడాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన వెంట ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శ్రీనివాస్, ఈఓపీఆర్‌డీ బద్రునాయక్, ఏపీఓ జ్యోతి, ఏపీఎం జీవరత్నం తదితరులు ఉన్నారు.

తైబజార్ డబ్బులు వసూలు చేయాలి



వినతిపత్రం అందజేస్తున్న అడ్డాకుల గ్రామస్తులు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ (అడ్డాకుల): గతంలో తైబజార్ దక్కించుకున్నవారితో పూర్తిగా డబ్బులు వసూలు చేసిన తర్వాతనే వేలం పాట నిర్వహించాలని గ్రామస్తులు అన్నారు. ఈ మేరకు ఎంపీడీఓ శ్రీనివాసులుకు గురువారం వినతి పత్రం అందజేశారు. వారాంతపు కూరగాయల సంత దక్కించుకున్న కాంట్రాక్టర్ పాత బకాయిలు పూర్తిగా చెల్లించకుండానే వేలం నిర్వహించడం సరికాదన్నారు. కార్యక్రమంలో యాకూబ్, ప్రేమ్‌కుమార్, సుదర్శన్, మన్యం, సులేమాన్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో అన్నప్రాసన



అన్నప్రాసన చేస్తున్న అంగన్‌వాడీలు

మిడ్జిల్: లాక్యాతండా అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బాలింతలకు, చిన్నారులకు ఇచ్చే పౌష్టిక ఆహారం గురించి వివరించారు. అలాగే మూడు సంవత్సరాలు నిండిన పిల్లలు అంగన్‌వాడీ చేరాలని సూచించారు. సూపర్‌వైజర్ కల్పన, ఉపాధ్యాయులు మల్లయ్య, చెన్నయ్య, అంగన్‌వాడీలు రంగమ్మ, చంద్రకళ, ఉన్నారు.

మొక్కల పెంపకంపై 'అవగాహన పెరగాలి'



అడ్డాకులలో పాదయాత్రకు స్వాగతం పలుకుతున్న స్థానికులు

- అడ్డాకులకు చేరిన పాదయాత్ర

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ (అడ్డాకుల): వనపర్తి పట్టణానికి చెందిన సాగర్ స్నేక్ సొసైటీ వ్యవస్థాపకుడు చీర్ల కృష్ణసాగర్ చేపట్టిన పాదయాత్ర గురువారం అడ్డాకులకు చేరుకుంది. 'మొక్కలు నాటండి...పర్యావరణాన్ని కాపాడండి' అనే నినాదంతో అలంపూర్ జోగులాంబ ఆలయం నుంచి హైదరాబాద్‌కు చేపట్టిన పాదయాత్ర 44వ నంబర్ జాతీయ రహదారిపై పెబ్బేర్, కొత్తకోట మీదుగా అడ్డాకులకు చేరింది. మార్గమధ్యలో కృష్ణసాగర్ కాలుష్యాన్ని నివారించి పర్యావరణాన్ని కాపాడాలని ప్రచారం చేస్తూ రోడ్డు పక్కన మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఇందులో రహదారి సమీపంలోని గ్రామాల ప్రజలను భాగస్వాములను చేయడం ద్వారా మొక్కల పెంపకం అవశ్యకతపై విస్తృత ప్రచారం సాగుతోంది. శుక్రవారం అడ్డాకుల నుంచి మొదలై శాఖాపూర్, కొమిరెడ్డిపల్లి, మూసాపేట, జానంపేట మీదుగా పాదయాత్ర అన్నాసాగర్ చేరుకోనుందని కృష్ణసాగర్ తెలిపారు. అడ్డాకులలో పాదయాత్రకు సింగిల్‌విండో అధ్యక్షుడు ఎం.జితేందర్‌రెడ్డి, ఎంపీటీసీ రంగన్నగౌడ్, విజయమోహన్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, దానేలు, వేఘనాథ్, వెంకటేష్, శ్రీనివాస్ యాదవ్, బాలరాజు తదితరులు స్వాగతం పలికారు. అడ్డాకుల హైస్కూల్‌లో మొక్కలు నాటారు.

దళితులపై దాడులు అరికట్టాలి



పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాయకులు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ : జిల్లా ఎస్పీగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన జానకిని ఎమ్మార్పీఎస్ (టీఎస్) దక్షిణ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు మల్లెపోగు శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు నరేష్, ప్రధాన కార్యదర్శి రావుల కృష్ణ, కార్యదర్శి రఘులు గురువారం మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాలో మాదిగ, మాదిగ ఉపకులాల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఎస్పీ దృష్టికి తీసుకెళ్లినట్లు శ్రీనివాస్ తెలిపారు. ముఖ్యంగా దళితులకు సంబంధించిన గైరాన్ భూములను కబ్జా చేయడం, దళితులపై జరుగుతున్న దాడులను అరికట్టాలని కోరినట్లు వివరించారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులలో స్టేషన్ బెయిల్ ఇవ్వొద్దని, అట్రాసిటీ కేసు నమోదైన వెంటనే బాధితులకు వచ్చే నష్టపరిహారం ఇవ్వడంలో జాప్యం లేకుండా చూడాలని ఎస్పీ దృష్టికి తీసుకెళ్లినట్లు వివరించారు.

నులిపురుగుల నివారణ మాత్రల పంపిణీ



మాత్రలు వేస్తున్న సిబ్బంది

మహమ్మదాబాద్: నులిపురుగులను నివారణ చర్యలు చేపట్టకపోతే చిన్నారులు ఆరోగ్యంగా ఎదగలేరని మహమ్మదాబాద్ ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి రహమత్ తెలిపారు. మొకర్లాబాద్ పాఠశాలలో విద్యార్థులకు నులిపురుగుల మాత్రలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ రాఘవేందర్, ఏఎన్ఎంలు, సిబ్బంది పాల్గొన్నారు.